
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
బుధవారం 25 సెప్టెంబరు 2024



- వానాకాలం ధాన్యం సేకరణపై అధికారుల కసరత్తు
- ఇప్పటికే దిశా నిర్దేశం చేసిన కలెక్టర్
- 5.73 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని అంచనా
- జిల్లాలో 421 కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

కొనుగోళ్లకు.. రెడీ..



జగిత్యాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వానాకాలంలో సాగైన వరిధాన్యం సేకరణకు అధికారులు కసరత్తులు చేస్తున్నారు. ధాన్యం చేతికి రావడానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ కొనుగోళ్లపై జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులు ప్రణాళికలు రూపొందించి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ మేరకు కలెక్టర్ ఇటీవల సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి కొనుగోళ్లపై దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో ఆలస్యంగా వరినాట్లు వేసుకోవడంతో అక్టోబర్ రెండు, మూడు వారాల్లో కోతలు ప్రారంభం కానున్నాయి. సెప్టెంబర్ చివరి వారం నుంచి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో 5.73 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. కొనుగోలు కేంద్రాల పెంపు, లారీల సరఫరా, గన్నీ సంచులు తదితర ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నారు.

జిల్లాలోని కొనుగోలు కేంద్రాలు...

జిల్లా వ్యాప్తంగా 421 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి అధికారులు నిర్ణయించారు. ఇందులో 133 కేంద్రాలు ఇందిరాకాంతి పథం మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేయనుండగా, 277 కేంద్రాలు సహకారశాఖ ద్వారా, ఒకటి మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు గానూ 1.43లక్షల గన్నీ బ్యాగులు అవసరం ఉండగా, ప్రస్తుతం జిల్లాలో 23 లక్షల గన్నీ సంచులను అందుబాటులో ఉన్నాయి. మరో 1.20 లక్షల గన్నీ సంచులను కొనుగోలు చేయడానికి పౌరసరఫరా శాఖ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఏ మాసంలో ఎంత ధాన్యం..

జిల్లా వ్యాప్తంగా 5.73 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేయగా, ఇందులో అక్టోబర్‌లో 57వేల మెట్రిక్ టన్నులు, నవంబరులో 1.70 లక్షల మెట్రిక్ టన్నులు, డిసెంబరులో 2.87 లక్షల మెట్రిక్ టన్నులు, జనవరిలో 57వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వస్తుందని అంచనా వేశారు.

జిల్లాలో 2.80 లక్షల ఎకరాల్లో వరి సాగు..

జిల్లాలో ప్రధానంగా వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది సాగు విస్తీర్ణం గత ఏడాది కంటే పెరిగింది. 2021-22 వానాకాలం సీజన్‌లో 2,92,855 ఎకరాల్లో వరి సాగు చేయగా 2022-23 వానాకాలం సీజన్‌లో 3,05,562 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుత వా నాకాలం సీజన్‌లో 2.80 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. జిల్లాలో ఎక్కువగా దొడ్డు రకం వరి సాగు కావడంతో ధాన్యంలో 75 శాతం కొ నుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉంది. జిల్లాలో 3.86 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం, 1.86 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రావచ్చని అంచనా వేస్తున్నారు.

ఆలస్యంగా వరి నాట్లు..

జిల్లాలో కొన్నేళ్లుగా వానాకాలంలో ఎక్కువగా వరి సాగు చేస్తున్న రైతు లు ప్రస్తుత సీజన్‌లో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఆలస్యంగా వరి నాట్లు వేశారు. 75 శాతం దొడ్డు రకం, 25 శాతం సన్నరకం వరి సాగైన ట్లు అంచనాలున్నాయి. సన్నరకం ఇంటి అవసరాల కోసమే నిల్వ ఉంచు కోనున్నారు. యాసంగిలో 95 శాతం దొడ్డు రకం సాగుంటుంది. దిగుబడి వచ్చిన ధాన్యంలో 90 శాతం కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి వస్తుంది. జూలై, ఆగస్టు మాసాల్లో భారీ వర్షాలు, వరదల కారణంగా మొదట్లో నాట్లు వేసుకున్న పంట కొట్టుకపోవడం, ఇసుక మేటలు వేయడంతో రెండోసారి నారు పోసుకొని ఆగస్టు నెలాఖరు వరకు నాట్లు వేశారు. సాగు ఆలస్యం కావడంతో స్వల్పకాలిక దొడ్డు రకాల వరిసాగుకు ఎక్కువగా మొగ్గు చూపారు. దీంతో ఈ వానా కాలం సీజన్‌లో గతంలో కంటే ఎక్కువగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చే అవకాశం ఉంది.

పెరిగిన మద్దతు ధర...

గత సీజన్‌లో ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ. 2,203, బీ గ్రేడ్ సాధా రణ రకం వడ్లకు రూ. 2,183 చెల్లించారు. ప్రస్తుత యేడాది ఏ గ్రేడ్ ధా న్యానికి క్వింటాలుకు రూ. 2,320, సాధారణ బీ గ్రేడ్ రకానికి రూ. 2,300 ధర నిర్ణయించారు. గత యేడాది కంటే అదనంగా మద్దతు ధర పెరి గిం ది. ధాన్యంలో 17 శాతం కంటే తక్కువ తేమ ఉన్నప్పుడే మద్దతు ధర లభిస్తుందని అధికారులు అంటున్నారు. రైతులు ధాన్యం బాగా ఆరబోసి కేంద్రాలకు తీసుకొస్తే తూకం వేయడంలో ఇబ్బం దులు ఉండవని అధి కారులు అంటున్నారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు



ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరించడానికి అనుగుణంగా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాము. ఇప్పటికే ఇందుకు అవసరమైన అంచనాలు రూపొందించాము. సీజన్‌లో దిగుబడి కానున్న వరి ధాన్యం, ఏర్పాటు చేయాల్సిన కేంద్రాలు, ధాన్యం తరలింపునకు వా హనాలు, నిల్వలకు గోదాములు, హమాలీలు, గన్నీ సంచులు తదితర ఏ ర్పాట్లపై దృష్టి సారించాము. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నాము.

- సత్య ప్రసాద్, జిల్లా కలెక్టర్

డీసీఎంఎస్ కేంద్రాన్ని కేటాయించాలి

ఎమ్మెల్సీని కలిసిన అల్లీపూర్ రైతు మిత్ర సంఘం సభ్యులు



ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అల్లీపూర్ రైతులు

జగిత్యాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అల్లీపూర్ రైతు మిత్ర ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌కు డీసీఎంఎస్ కేంద్రాన్ని కేటాయించాలని కోరుతూ మంగళవారం జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి పలువురు రైతులు కలిసి వినతిపత్రం అందించారు. అల్లీపూర్ గ్రామానికి చెందిన సుమారు 500 మంది రైతులు ఒకటిగా ఏర్పడి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు తక్కువ ధరకు అందజేస్తున్నామని, డీసీఎంఎస్ కేంద్రాన్ని కేటాయించినట్లయితే మరింత సేవలు అందించే అవకాశాలున్నాయని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్సీ రైతులకు తనవంతు సహకారాలను అందిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు అల్లీపూర్ రైతులు పాల్గొన్నారు.

●పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా వరద బాధితుల కోసం సేకరిస్తున్న విరాళాల సేకరణ బృందం ఎమ్మెల్సీని కలిశారు. వరద బాధితుల కోసం ఎమ్మెల్సీ తన వంతుగా కొంత విరాళాన్ని అందించారు.

సంకేతభాషతో దివ్యాంగులకు ఉజ్వల భవిష్యత్తు

జిల్లా వైద్యాధికారి డా. సమియొద్దీన్

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 24: సంకేత భాషను అభ్యసించడం ద్వారా దివ్యాంగులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా వైద్యాధికారి డా. సమియొద్దీన్ అన్నారు. అంతర్జాతీయ సంకేత భాషా వారోత్సవాలను పురస్కరించుకొని స్థానిక మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు సంకేత భాషపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులరాలు డాక్టర్ పద్మ చెవుడు రాకుండా విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి సంకేత భాషపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూసీడీ ప్రోగ్రాం అధికారి డా.అర్చన, ఖిలాగడ్డ పట్టణ పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్, పాఠశాల కోఆర్డినేటర్ శ్రీధర్, స్టాఫ్‌నర్స్ రవి, ఆరోగ్య పర్యవేక్షకులు మురళీధర్, శ్యాంసుందర్, సిబ్బంది, పాల్గొన్నారు.

వరి పంట ధ్వంసం

కొడిమ్యాల, సెప్టెంబరు 24 : మండలంలోని హిమ్మతురావుపేట గ్రామ శివారులో మంగళవారం సుమారు 15 ఎకరాలలో వరి పంటను కోతులు ధ్వంసం చేసినట్లు పలువురు రైతులు తెలిపారు. నిత్యం గుంపులు గుంపులుగా కోతులు వచ్చి వరి పంటను. ఇతర పంటలను ధ్వంసం చేయటంతో ఈ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు.

విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రధానం

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 24: విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రధానమని కేజీఆర్, శ్రీచైతన్య స్కూల్స్ డైరెక్టర్ క్యాతం గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని స్థానిక బండారి గార్డెన్‌లో కేజీఆర్, శ్రీచైతన్య స్కూల్స్ విద్యార్థులకు ప్రముఖ వక్త దివాస్ గుప్తాచే కమ్యూనికేషన్ స్కిల్స్‌పై విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు.

విద్యార్థుల్లో దాగి ఉన్న స్టేజీ ఫియర్‌ని పోగొట్టేందుకు, భవిష్యత్తులో ఉపాధి అవకాశాల్లో తమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటేందుకు ఈ స్కిల్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ క్యాతం గంగారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడామైదానం నుంచే రాజకీయాల్లోకి వచ్చా

●ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ ●ఘనంగా ప్రారంభమైన జిల్లా క్రీడల సంబరాలు



మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 24 : క్రీడామైదానం నుంచే రాజకీయాల్లోకి వచ్చానని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక మినీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడల పోటీలు ప్రారంభించగా, విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం, పతాక ఆవిష్కరణ చేసి, క్రీడలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అంటేనే రాష్ట్రంలో క్రీడల ఖిలాగా మారిందన్నారు. విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా వసతులు ఏర్పాటు చేయాలన్నారు. క్రీడాకారులకు మైదానంలోనే భోజనవసతి ఏర్పాటు చేయాలని, తాము సహకరిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ క్రీడలు మానసిక శారీరక ధారుఢ్యానికి స్నేహభావానికి తోడ్పడుతాయన్నారు. జగిత్యాల నియోజకవర్గ పరిధిలో క్రీడలకు సంబంధించి ఏదైనా తనవంతు సహకారం అందిస్తానన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని, పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ లక్ష్మీరాం నాయక్, డీఈవో డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి, డీవైఎస్‌ఓ రవి బాబు, కౌన్సిలర్ చుక్క నవీన్, పీఈటీలు, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

●జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో అండర్ 17 విభాగంలో బాలికల క్రీడల్లో వాలీబాల్‌లో సారంగాపూర్ విన్నర్ నిలవగా, గొల్లపల్లి రన్నర్‌గా నిలవగా, కబడ్డీ పోటీల్లో జగిత్యాల రూరల్ విన్నర్‌గా నిలవగా, ఇబ్రహీంపట్నం రన్నర్‌గా, ఖోఖో పోటీల్లో మల్యాల విన్నర్‌గా నిలవగా, కథలాపూర్ రన్నర్‌గా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు.

బ్రహ్మంగారి ఆలయ ప్రహరీ కోసం సహకరించాలి

ప్రభుత్వ విప్‌ను సహాయం కోరిన విశ్వబ్రాహ్మణులు



అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణులు

ధర్మపురి, సెప్టెంబరు 24: బుగ్గారం మండల కేంద్రంలో గల బ్రహ్మంగారి ఆలయ ప్రహరీ నిర్మాణం కోసం సహాయం అందించాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను మంగళవారం విశ్వబ్రాహ్మణులు కోరారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరిని మంగళవారం విశ్వబ్రాహ్మణులు కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు తనకు ఎన్నికల్లో పూర్తి సహాయ సహకారం అందించినట్లు గుర్తు చేశారు. ప్రహరీ నిర్మాణ విషయంలో సానుకూలంగా స్పందించి అవసరమైన సహాయ సహ కారాలు అందిస్తానని తెలిపారు. విశ్వబ్రాహ్మణులు తమ సమ స్యలు నేరుగా తన దృష్టికి తీసుకవస్తే వెంటనే పరిష్కారం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బుగ్గా రం మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నగునూరి సర్వాగౌడ్, ఆలయ పూజారి విలాసాగరపు శ్రీనివాసాచారి, పొనకంటి కైలాసం, ఎల్లేశ్వరం ప్రశాంత్, కొడిమ్యాల రవిచారి, రేవెల్లి రమేష్ పాల్గొన్నారు.

మహిళా యూనివర్సిటీకి ..

ఐలమ్మపేరు పెట్టడం అభినందనీయం

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 24: కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పేరును పెట్టడం అభినందనీయం అని, రాష్ట్రంలో ఐలమ్మ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన సాగిస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని స్థానిక చింతకుంట చెరువు సమీపంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిం చిన అనంతరం, విగ్రహ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే సంజయ్‌తో పాటు నాయకులు క్షీరాభిషేకం చేశారు. బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌తో పాటు కౌన్సిలర్‌లు, రజకసంఘ నాయకులు పాల్గొన్నారు.

●దుర్గాదేవి శరన్నవరాత్రుల ఉత్సవాలకు సంబంధించిన అష్టచత్వారింశత్(48వ) ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు శ్రీభక్తమార్కండేయ దేవాలయం సభ్యులు అందజేసి ఆహ్వానించారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతిని కలిసి పత్రికను అందించి ఆహ్వానించారు.

●పట్టణంలోని 27వ వార్డుకు చెందిన మహ్మద్ అబ్దుల్ అక్బల్ సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.13వేల చెక్కును బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు.

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో నాణ్యమైన ఉపకరణాలు

● టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 24 : విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ ఉపకరణాలు తక్కువ ధరల్లో అందిస్తున్నామని కరీంనగర్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వడ్లకొండ గంగాధర్ ఓ ప్రకటనలో తెలిపారు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్, కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అనుబంధిత ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈ ఎస్ఎల్) భాగస్వామ్యంతో ఉపకరణాలు అందిస్తున్నామన్నారు. విద్యుత్ ఆదా చేసేందుకు ఎల్ఈడీ బల్బులు, ట్యూబ్ లైట్లు, ఇండక్షన్ స్టవ్, ఫైవ్‌స్టార్ బీఎల్‌డీసీ, ఫ్యాన్లు, సూపర్ ఎఫిషియంట్ ఎయిర్ కండిషనర్లు, ఎల్ఈడీ, ఇన్వర్టర్ బల్బులు అందుబాటులో ఉంచామన్నారు. వినియోగదారులు ముందుగా www.tgnpdcl.com వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) వారి హోం పేజీలోకి వెళ్లాలన్నారు. అక్కడ అందుబాటులో ఉన్న విద్యుత్ ఉపకరణాలను కొనుగోలు చేయవచ్చని తెలిపారు. వినియోగదారులకు కావాల్సిన విద్యుత్ ఉపకరణాలను సులభతరంగా ఆర్డర్ చేసుకోవచ్చన్నారు. విద్యుత్ వినియోగదారులు కొనుగోలు చేసిన వస్తువులు వారి ఇంటికే డెలివర్ చేస్తామని తెలిపారు. ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) పేజీలో ఉన్న క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి ఆర్డర్ చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అస్వస్థతకు గురైన వృద్ధుడిని బస్సులోంచి దింపేసిన కండక్టర్

● దిగిన వెంటనే ఆగిన ఊపిరి ● మృతుడిది కామారెడ్డి జిల్లా

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 24: అస్వస్థతకు గురైన వృద్ధుడిని ఆర్టీసీ బస్సులోంచి కండక్టర్ దింపేశాడు.. కొద్దిసేపటికే ఆ వృద్ధుడు గుండెపోటుతో మృతిచెందిన ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం రత్నగిరిపల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు వట్టిమల్ల ఎల్లయ్య(67) తన భార్య రాజవ్వతో కలిసి కరీంనగర్‌లోని ఆసుపత్రికి వెళ్లేందుకు గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామం స్టేజీ వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కారు. కరీంనగర్ వరకు టిక్కెటు తీసుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి వద్దకు బస్సు చేరుకోగానే వృద్ధుడు ఎల్లయ్య అస్వస్థతకు లోనయ్యాడు. కండక్టర్ ఆ దంపతులను ఇక్కడే హాస్పిటల్ ఉంది చూపించుకోమని బస్సు నుంచి కిందకు దింపేశాడు. వెంటనే ఎల్లయ్య కిందపడిపోగా అక్కడ ఉన్న యువకులు 108 వాహనానికి సమాచారం అందించడంతో సిబ్బంది చేరుకుని సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వృద్ధుడు గుండెపోటుతో చనిపోయాడని నిర్ధారించారు. అస్వస్థతకు గురైన వృద్ధుడిపై మానవత్వం చూపాల్సిన ఆర్టీసీ బస్సు కండక్టర్ వృద్ధ దంపతులను బస్సు నుంచి కిందకు దింపేడయంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎల్లారెడ్డిపేటలో ఆసుపత్రి ఉందని అక్కడి వరకు తీసుకెళ్లాలని ప్రాధేయపడినా కండక్టర్ పట్టించుకోలేదని మృతుడి భార్య రాజవ్వ ఆవేదన వ్యక్తం చేసింది. ఆర్టీసీ కండక్టర్ వ్యవహరించిన తీరుపై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రాజవ్వతో పాటు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

గ్రామపంచాయతీ సిబ్బందిని అడ్డుకున్న గ్రామస్థులు



గ్రామ పంచాయతీ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్థులు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 24: కేసీఆర్ నగర్‌లో పారిశుధ్య పనులకు వెళ్తున్న గ్రామపంచాయతీ సిబ్బందిని గ్రామస్థులు మంగళవారం అడ్డుకున్నారు. తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామశివారులోని కేసీఆర్ నగర్‌లో గ్రామపంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులకు వెళ్తుండగా గ్రామస్థులు అడ్డుకొని ధర్నాకు దిగారు. కేసీఆర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం సిరిసిల్ల పట్టణ వాసులకు కేటాయించి నిర్వహణ మున్సిపల్‌కు ఉండేది. 15 రోజుల క్రితం కేసీఆర్ నగర్ నిర్వహణ చేపట్టలేమని మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. కేసీఆర్ నగర్‌లో పారిశుధ్య పనులు నిర్వహణ లేక చెత్తాచెదారం పేరుకుపోవడంతో కలెక్టర్ సందర్శించి గ్రామపంచాయతీకి నిర్వహణ అప్పగించారు. గ్రామస్థులు కేసీఆర్ నగర్‌ను మండపల్లి గ్రామ పంచాయతీలో విలీనం చేయవద్దంటూ నిరసిస్తూ ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ క్రమంలో మంగళవారం మండెపల్లి గ్రామపంచాయతీ పారిశుధ్య సిబ్బంది కేసీఆర్ నగర్‌లో విధులు నిర్వహించడానికి వెళ్తుండగా గ్రామస్థులు అక్కడికి చేరుకొని వారిని అడ్డుకున్నారు. గ్రామపంచాయతీ గేటు ఎదుట ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని గ్రామస్థులకు నచ్చ చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ నగర్‌ను మండేపల్లి గ్రామపంచాయతీలో విలీనం చేస్తే ఒప్పుకునేది లేదని తెలిపారు.

క్రైం కార్నర్

మరో రూ.14లక్షలు దుర్వినియోగం

- అంజన్న ఉద్యోగిపై పోలీస్‌స్టేషన్‌లో మరోసారి ఫిర్యాదు
- గతంలో రూ.38లక్షలు.. కేసు నమోదు

మల్యాల, సెప్టెంబరు 24 : కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ వేలంల ఇన్‌చార్జీగా విధులు నిర్వహించి దేవస్థానం సొమ్ముల దుర్వినియోగానికి పాల్పడిన కె.శ్రీనివాసాచారిపై అధికారులు మంగళవారం మరోసారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.14 లక్షలు దేవస్థానం ఖాతాకు జమ చేయకుండా దుర్వినియోగానికి పాల్పడినట్లు పేర్కొంటూ క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొండపైన దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు విడతల వారిగా తమ సొమ్ములు దేవస్థానానికి చెల్లిస్తుండగా కొన్నాళ్ల క్రితం ఆ బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాసాచారి వ్యాపారులు చెల్లించిన 2023-24 సంవత్సర టెండర్లకు సంబంధించిన రూ.37.90 లక్షలు దేవస్థానం ఖాతాలో జమ చేయకుండా దుర్వినియోగానికి పాల్పడినట్లు పేర్కొంటూ గత ఫిబ్రవరిలో సస్పెన్షన్ వేటు వేశారు. సస్పెన్షన్‌తో పాటు అతనిపై మల్యాల పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఈవో వెంకటేష్ ఫిర్యాదు చేయగా కేసు నమో దు చేసిన అధికారులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. తాజాగా 2022-23 సంవత్సర ఖాతాలు పరిశీలించగా మరో రూ.14,49,900లక్షలు టెండర్‌దారుల చెల్లించిన సొమ్ములు దేవస్థానం ఖాతాలో జమ చేయనట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుత ఈవో రామకృష్ణరావు మంగళవారం శ్రీనివాసాచారిపై మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగ శ్రీనివాసాచారిపై సస్పెన్షన్ పొడగిస్తూ దేవాదాయ శాఖ అదేశాలు జారీ చేసింది.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న బస్సు

- ఒకరికి తీవ్ర గాయాలు

మల్యాల, సెప్టెంబరు 24 : ద్విచక్రవాహనాన్ని వెనుకాల నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మల్యాల మండల కేంద్రానికి చెందిన పత్తిపాక గంగాధర్ జగిత్యాల నుంచి బైక్‌పై నుంచి మల్యాలకు వస్తుండగా నూకపల్లి సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద వెనుకాల నుంచి వచ్చిన బస్సు ఢీకొంది. దీంతో గంగాధర్ తలకు తీవ్ర గాయాలు అవడంతో పలువురు 108కి సమాచారం అందించగా అంబులెన్స్ ఈఎంటీ ఎస్.జ్యోతి, పైలట్ ఆంజనేయులు ప్రథమ చికిత్స అందజేశారు. గాయపడిన వ్యక్తిని జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

21 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

సైదాపూర్, సెప్టెంబరు 24: మండలంలోని జాగీర్‌పల్లిలో అక్రమంగా నిల్వ చేసిన 21క్వింటాళ్ల పీఈడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. జాగీర్‌పల్లి గ్రామంలో మంగళవారం తెల్లవారు జామున సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా, శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామానికి చెందిన చిన్న బత్తుల రాజయ్య అక్రమంగా ఓ ఇంట్లో 16 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నిల్వ చేశాడని తెలిసి స్వాధీనం చేసుకున్నామన్నారు. బొమ్మల రామారం బోనగిరి గ్రామానికి చెందిన హేరావత్ మోతిలాల్ వద్ద ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నామని చెప్పారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

తిమ్మాపూర్, సెప్టెంబరు 24 : మండలంలోని మహాత్మానగర్ రాజీవ్ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎల్ఎండి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నుస్తులాపూర్ గ్రామానికి చెందిన మాడిశెట్టి నర్సయ్య (55) సోమవారం రాత్రి అలుగునూర్ నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో నరసయ్య తన ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో నరసయ్య తీవ్రంగా గాయ పడ్డాడు. ఆయనను కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారు జామున నరసయ్య మృతి చెందాడు. అతడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎల్ఎండీ ఎస్సై వివేక్ తెలిపారు.

- నర్సయ్య కళ్లు సజీవం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాడిశెట్టి నర్సయ్య నేత్రాలను ఆయన కుమారుడు మాడిశెట్టి రాజేష్ దానం చేసినట్లు శాతవాహన లయన్స్ క్లబ్, కాళేశ్వరి లయన్స్ బాధ్యులు కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, కంది జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. నరసయ్య పార్థివ దేహం నుంచి జత నేత్రాలను సేకరించి హైదారాబాద్‌లోని ఎల్ వీ ప్రసాద్ అసుపత్రికి పంపించామన్నారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

రామడుగు, సెప్టెంబరు 24: మండలంలోని వెదిర పరిధిలోని వెంకటగిరికి చెందిన విజ్జగిరి శంకరయ్య (65) అనే వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలి పారు. శంకరయ్య మద్యానికి బానిస కావడం మూలంగా పక్షపాతానికి గురయ్యాడు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఈ నెల 19న గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళ వారం మృతి చెందాడు. మృతుడికి కుమారుడు విజ్జగిరి గంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో ఎల్లయ్య తెలిపారు.

వరట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 24: వివాహం జరిగిన ఏడు నెలలకే అదనపు వరకట్నం వేధింపులతో కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌కు చెందిన దొంత శ్రావణి(22) మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు కట్టరాంపూర్‌లోని ఇంటిలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. సిద్దిపేట మండలం ఎల్లంపల్లి గ్రామానికి చెందిన శ్రావణికి ఫిబ్రవరి 25న కట్టరాంపూర్‌కు చెందిన అజయ్‌కుమార్‌తో వివాహం జరిగింది. వివాహ సమ యంలో ఒప్పుకున్న వరకట్నం డబ్బులు, ఇతర లాంఛనాలు ముట్టజెప్పారు. అయినప్పటికీ అదనపు వరకట్నం తేవాలంటూ కొద్ది రోజుల నుంచి శ్రావణిని ఆమె భర్త అజయ్‌కుమార్, అత్త ఉపేంద్ర, మామ ఆంజనేయులు వేధింపులకు గురి చేస్తుండటంతో జీవితంపై విరక్తి చెందిన తన కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి సంగెం కొంరయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు ముగ్గురిపై వరకట్నం వేధిం పుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు.

కాళేశ్వరం-మంథని-రామగిరి
సర్క్యూట్ అభివృద్ధికి చర్యలు

- దేవాలయాల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలి
- 2027లో జరిగే గోదావరినది పుష్కరాల నిర్వాహణకు చర్యలు
- దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్



వేద పండితులతో మాట్లాడుతున్న శైలజా రామయ్యర్

మంథని, సెప్టెంబర్ 24: కాళేశ్వరం-మంథని-రామగిరి సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్ వెల్లడించారు. మంగళవారం మంథనిలోని శ్రీమహాలక్ష్మి దేవాలయంలో దేవాదాయ, సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోదావరి తీరంలోని శ్రీగౌతమేశ్వర దేవాలయాన్ని పురావస్తుశాఖ అధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో దేవాలయాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ సమీక్షా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాళేశ్వరం, మంథని పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆలయాలను సందర్శించామన్నారు. కాళేశ్వరం దేవాలయం లోపల, పరిసరాల్లో అభివృద్ధి పనులు చేపట్టే భక్తులకు అవసరమైన వసతులు ఏరకంగా కల్పించాలనే అంశంపై కాళేశ్వరంలో చర్చించామన్నారు. గోదావరినదిని ఏరకంగా శుభ్రం చేయాలి, పుణ్యస్నానాలు చేసేందుకు, షవర్స్ మహిళలకు స్నానాల గదుల ఏర్పాటు విషయాలను చర్చించామన్నారు. మంథనిలో ఆలయాలను సంపూర్ణంగా అభివృద్ధి చేసేందకు, వచ్చే భక్తులకు కావాల్సిన సదుపాయాల కల్పన కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. దేవాలయాల అభివృద్ధికి రూపొందించే ప్రణాళికల్లో స్వల్ప, దీర్ఘకాలికంగా వేర్వేరుగా ఉండాలన్నారు. 2027 సంవత్సరంలో గోదావరినది పుష్కరాలు వస్తున్నాయని, వీటికి సంబంధించి ఘాట్ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలన్నారు. గోదావరినది తీరంలోని శ్రీగౌతమేశ్వర ఆలయం వద్ద పుష్కరాల సందర్భంగా పార్కింగ్ స్థలం గుర్తించాలన్నారు. మంథనిలో ఆలయాలకు ఒక గుడి నుంచి మరో గుడికి హెరిటేజ్ వాకింగ్ చేసే విధంగా ప్రణాళిక చర్యలు తీసుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహణ కోసం కళాభారతి లాంటి భవనం నిర్మాణానికి అనువైన స్థలం ఎంపిక చేయాలన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. మంథని పట్టణంలో ఆరు దేవాలయాలు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయన్నారు. శ్రీసిలేశ్వర-సిద్ధేశ్వరాలయం పురావస్తుశాఖ పరిధిలో ఉంటుందన్నారు. శ్రీగౌతమేశ్వరాలయం వద్ద స్నానాల ఘాట్, షవర్లు, స్నాన గదుల ఏర్పాటు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. స్కంధ పురాణం ద్వారా శ్రీగౌతమేశ్వర ఆలయ పురాణం తెలుసుకొని, దీనికి సంబంధించి లైట్‌షో, వాటర్‌షో ఏర్పాటు అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. శ్రీమహాలక్ష్మి ఆలయం సమీపంలోని చెరువులో అక్రమణలు తొలగించి పునరుద్ధరిస్తామని, చెరువులో డ్రైనేజీ నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రామగిరి ఖిల్లాను పర్యాటకశాఖ పరిధిలో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీవో హనుమానాయక్, తహసీల్దార్ రాజయ్య, పురావస్తు, దేవాదాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్య

- మృతికి తల్లే కారణమంటూ కులస్థులు దాడి
- ఆస్తి తండ్రి పేరు మీదకు మార్చాలని అంత్యక్రియలు నిలిపివేత

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 24 : మండలంలోని జగ్గాసాగర్ గ్రామానికి చెందిన ఏనుగు ప్రభాస్(19) అను యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన ఏనుగు ప్రతాప్, అనంత దంపతులకు కుమారుడు ఏనుగు ప్రభాస్ ఉన్నాడు. ప్రతాప్ జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. గ్రామంలో ప్రభాస్ తన తల్లితో కలిసి ఉంటున్నాడు. ప్రభాస్ ఇంటర్ పూర్తి చేసి హోటల్ మేనేజ్మెంట్ చేద్దామని తల్లిదండ్రులకు తెలిపాడు. వారు ఏదైనా జాబ్ చేయమని మందలించడంతో మనస్థాపానికి గురై ఈనెల 8న రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించి తల్లి చికిత్స కోసం మెట్‌పల్లికి తరలించగా వైద్యులు పరిశీలించి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న ప్రభాస్ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఈనెల 22న నిజామాబాద్‌లో చికిత్స పొందుతున్న ప్రభాస్ వాంగ్మూలాన్ని మెజిస్ట్రేట్ రికార్డు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆస్తి మార్పిడి కోసం ఆగిన అంత్యక్రియలు

మృతికి తల్లె కారణమంటూ కులస్థులు దాడి..

చికిత్స పొందుతూ మృతి చెందిన ప్రభాస్ అంత్యక్రియలు ఆస్తి మార్పిడి కోసం ఆగిపోవాల్సి వచ్చింది. ఇల్లరికం వచ్చిన ఏనుగు ప్రతాప్ 17 ఏళ్ల నుంచి గల్ఫ్ వెళ్లి సంపాదించిన ఆస్తి మొత్తం తన భార్య అనంత పేరు మీద ఉందని గ్రామస్థులు ఆరోపించారు. ఆ ఆస్తి మొత్తం ప్రతాప్ పేరున రిజిస్టర్ చేస్తేనే అంత్యక్రియలు చేయాలని అంత వరకు నిలపాలని బంధువులు మృతదేహాన్ని ఇంటి వద్దనే ఉంచారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని ఒప్పించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. మరోవైపు ప్రభాస్ మృతికి తల్లి అనంత కారణమని గ్రామంలోని కులస్థులు ఆరోపిస్తున్నారు. మంగళవారం ప్రభాస్ మృతదేహంతో ఇంటికి వచ్చిన తల్లిపై గ్రామంలోని కులస్థులు దాడి చేశారు. గమనించి ఎస్సై చిరంజీవి ప్రభాస్ తల్లిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. పెద్ద ఎత్తున గ్రామస్థులు చేరుకోవడంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వెంటనే డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి అక్కడి చేరుకుని వారిని శాంతింపజేశారు.

జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు బడితండా యువకుడు

రుద్రంగి, సెప్టెంబర్ 24 రుద్రంగి మండలం బడితండా గ్రామానికి చెందిన మాలోత్ అనిల్ జాతీయస్థాయి ట్రెక్కింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. అనిల్ కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ డీగ్రీ కళాశాలలో బీకాం రెండో సంవత్సరం చదువతున్నాడు. ఇటీవల జరిగిన శాతవాహన యూనివర్సిటీలో ట్రెక్కింగ్ పోటీల్లో పాల్గొన్నాడు. ఉత్తమ ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఆక్టోబరు 22న హిమచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీల్లో పాల్గొననున్నాడు. యువకుడు జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో బడితండా గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగిత్యాలలో ఆన్‌లైన్ మోసం

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 24 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ మహిళ ఆన్‌లైన్ మోసానికి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పట్టణంలోని పోచమ్మవాడ ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఆన్‌లైన్ యాప్ వలలో చిక్కుకుని అధిక డబ్బులు వస్తాయనే ఆశతో రూ. 1.78 లక్షల పెట్టుబడి పెట్టింది. పెట్టుబడి పెట్టిన మరుసటి రోజే యాప్ కనబడకపోవడంతో మోసాపోయానని గ్రహించిన మహిళ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

'నవోదయ' దరఖాస్తుల గడువు పొడిగింపు

చొప్పదండి, సెప్టెంబరు 24: పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశపరీక్ష దరఖాస్తు గడువును అక్టోబరు 7వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 8, 9 తేదీల్లో దరఖాస్తులను ఎడిట్ చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

పీజీ 2,4 సెమిస్టర్ల పరీక్షల ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 24 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జూలై, ఆగస్టు 2024లో నిర్వహించిన పీజీ, రెండవ, నాలుగవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్ మంగళవారం విడుదల చేశారు. ఎంఏ (ఇంగ్లీష్, ఉర్దూ, తెలుగు, ఎకనామిక్స్, సోషియాలజీ, ఎమ్మెస్‌డబ్ల్యూ) ఎంఎస్‌ఈ(వృక్షశాస్త్రం, జువాలజీ, స్టాటిస్టిక్స్, న్యూట్రిషన్ డైటెటిక్స్) ఎంసీఏ పరీక్షల ఫలితాలు శాతవాహన విశ్వవిద్యాలయం వెబ్సైట్ www. satavahana.ac.inలో అందుబాటులో ఉన్నాయన్నారు.

28న యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ

సుభాష్‌నగర్, సెప్టెంబరు 24 : ప్రభుత్వ ఆసుపత్రుల్లో యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు ఈ నెల 28 ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కరీంనగర్ ఆయుష్‌శాఖ జిల్లా ఇంచార్జీ డాక్టర్ యస్రబ్‌సుల్తానా, డీపీఎం ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఖాళీగా ఉన్న 90 పోస్టులను భర్తీ చేయనున్నట్లు కరీంనగర్‌లో 15మంది పురుషులు, 15 మంది స్త్రీలు, పెద్దపల్లి 10 మంది పురుషులు, 10 మంది స్త్రీలు, రాజన్నసిరిసిల్ల 8 మంది పురుషులు, 8 స్త్రీలు, జగిత్యాల 12 మంది పురుషులు, 12 మంది స్త్రీలు పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పురుషులు కనీసం 32 యోగా తరగతులు, స్త్రీలు 20 యోగా తరగతులకు హాజరుకావాలని సూచించారు. పురుష శిక్షకులకు ఒక తరగతికి రూ. 250 చొప్పున రూ. 8వేలు, స్త్రీలకు రూ. 5వేలు పారితోషికం ఇస్తారని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్హతతోపాటు కనీసం 6నెలల యోగా సర్టిఫికెట్ ఉండాలని, 45 సంవత్స రాలలోపు వయస్సు కలిగిన ఉండాలని, యోగా నైపుణ్యత ఉండాలని సూచించారు. ఈ పోస్టులు పార్ట్‌టైం పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు కరీంనగర్‌లోని రాంనగర్‌లో గల ఆయుష్, ఆయుర్వేద ఆసుపత్రిలో ఈ నెల 28న ఉదయం 10 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

మళ్లీ తెరుచుకున్న శ్రీరాంసాగర్ గేట్లు

- 7 గేట్ల ద్వారా 21,868 క్యూసెక్కుల నీరు దిగువకు

జగిత్యాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు చెందిన గేట్లు మంగళవారం ప్రస్తుత సీజన్‌లో మరోమారు తెరుచుకున్నాయి. ప్రాజెక్టుకు చెందిన 7వరద గేట్లను తెరిచి 21,868 క్యూసెక్కుల నీరును దిగువకు వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 45,858 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగునీటి కాలువలు, ఇతర అవసరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 45,858 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నుంచి స్పిల్‌వే ఆర్‌సీగేట్ల ద్వారా నీరు విడుదల చేస్తున్నందున గోదావరినదిలో చేపలు పట్టేందుకు వెళ్లరాదని, వలలు కొట్టుకుపోయే అవకాశం ఉన్నందున బయటకు తీసుకోవాలని, పశువుల కాపర్లు, సామన్య ప్రజలు ఎవరూ నదిలోకి దిగొద్దని, ప్రమాదానికి గురి కావద్దని అధికారులు కోరుతున్నారు.

కూతురికి అత్తింటి వేధింపులు..

- బావిలో దూకి తండ్రి బలవన్మరణం
- 9 గంటల పాటు కొనసాగిన గాలింపు చర్యలు
- లభ్యమైన మృతదేహం
- రాచర్లబొప్పాపూర్‌లో విషాదం



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 24 : కుమార్తెకు న్యాయం జరగడం లేదని సోమవారం రాత్రి పాడు పడిన బావిలో దూకిన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన అగుళ్ల శ్రీనివాస్ (48) మృతదేహం మంగళవారం తెల్లవారుజామున లభ్యమైంది. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని అగుళ్ల స్వరూప-శ్రీనివాస్ దంపతులకు కూతురు రమ్య, కొడుకు రాజేశ్ ఉన్నారు. రమ్యను సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన మిట్టపల్లి ప్రశాంత్‌కు ఇచ్చి 10 ఏళ్ల కిందట పెళ్లి జరిపించారు. వారికి పదేళ్ల వయసు లోపు ఉన్న ఇద్దరు పిల్లలు రిషివర్ధన్, కీర్తన ఉన్నారు. కొంత కాలంగా బార్యాభర్తల నడుమ కలహాలు చోటు చేసుకుంటున్నాయి. భర్తతో పాటు అత్తింటి వారు రమ్యను వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ క్రమంలో పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగాయి. మంచిగా చూసుకోవాలని మందలించినా మార్పు రాలేదు. దాంతో ఆరు రోజుల కిందట రమ్య అత్తింటిలో ఆత్మహత్యాప్రయత్నం చేసింది. విషయం తెలియడంతో తండ్రి శ్రీనివాస్ చేరుకుని చికిత్స చేయించి స్వగ్రామానికి తీసుకు వచ్చాడు. తన కూతురును అత్తింటి వారు వేధిస్తున్నారని పేర్కొంటూ ఈ నెల 21న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. న్యాయం జరగడం లేదని భావించిన శ్రీనివాస్ సోమవారం రాత్రి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని వారి సంఘానికి సంబంధించిన వాట్సాప్ గ్రూప్‌లో సందేశం పంపి ఇంటి సమీపంలోని పాడుబడిన వ్యవసాయ బావిలో దూకాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. బావి చుట్టూ చెట్లు ఏపుగా ఉండడంతో గాలింపు కష్టతరంగా మారింది. బావిలో నీళ్లు అధికంగా ఉండడం వల్ల మోటార్‌ను తెప్పించి నీటిని తోడేసేలా చర్యలు తీసుకున్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వేకువజాము వరకు తొమ్మిది గంటలపాటు గాలింపు కొనసాగింది. చివరకు శ్రీనివాస్ మృతదేహం లభ్యమవడంతో బయటకు వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

- ఆత్మహత్యకు కారణమైన ఆరుగురిపై కేసు

అగుళ్ల శ్రీనివాస్ ఆత్మహత్యకు కారణమైన సంఘటనలో సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన మృతుడి అల్లుడు మిట్టపల్లి శ్రీకాంత్‌తో పాటు ఆయన తల్లిదండ్రులు లక్ష్మీ, వీరస్వామి, సోదరుడు ప్రశాంత్, బంధువులు పద్మ, సతీష్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ పేర్కొన్నారు. శ్రీనివాస్ కూతురు రమ్యను సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన మిట్టపల్లి శ్రీకాంత్‌తో 10 ఏళ్ల కిందట పెళ్లి చేశారని పేర్కొన్నారు. కాలంగా భార్యాభర్తల నడుమ కలహాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 20న రమ్యను పుట్టింటి నుంచి అదనంగా ఐదు లక్షల రూపాయల కట్నం తీసుకురావాలని భర్తతో పాటు అత్తమామలు, మరిది, బంధువులు వేధింపులకు దిగడంతో ఆమె ఆత్మహత్యకు యత్నించిందని పేర్కొన్నారు. విషయం తెలిసిన తండ్రి శ్రీనివాస్ చేరుకుని ఆమెకు చికిత్స అందించి రాచర్లబొప్పాపూర్ గ్రామానికి తీసుకువచ్చాడని తెలిపారు. మృతుడు శ్రీనివాస్ కొడుకు రాజేశ్ ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.



బావి వద్ద ఎక్స్‌కవేటర్‌తో చెట్ల తొలగింపు

పిటీషన్ మేనేజ్‌మెంట్‌లో
గోదావరిఖని వన్‌టౌన్‌కు 4వ స్థానం

- రిసెప్షన్ ఆఫీసర్ వెంకట లక్ష్మి సేవలకు గుర్తింపు..
- సత్వర సేవల్లో బెల్లంపల్లి వన్‌టౌన్, ధర్మారం ఠాణాల ఎంపిక



ధర్మారం ఎస్ఐ లక్ష్మణ్



. కానిస్టేబుల్ వెంకటలక్ష్మి

కోల్‌సిటీ, సెప్టెంబరు 24 : పిటీషన్ మేనేజ్‌మెంట్ సిస్టంట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఐదు పోలీస్ స్టేషన్‌లను ఎంపిక చేయగా, గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు 4వ స్థానం లభించింది. పోలీస్ స్టేషన్‌లో రిసెప్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న కానిస్టేబుల్ వెంకటలక్ష్మి స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యదగా ప్రవర్తించి వారి సమస్యలను తెలుసుకుని అధికారుల వద్దకు తీసుకవెళ్లేవారు. వారి దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి రశీదు కూడా అప్పగిస్తున్నారు. ఉత్తమ సేవలు అందించినందుకు ఆమెకు గుర్తింపు లభించింది. ఠాణా కూడా ఎంపికైంది. అలాగే సత్వర సేవల విభాగంలో బెల్లంపల్లి వన్‌టౌన్‌కు 3వ స్థానం, ధర్మారం పోలీస్ స్టేషన్‌కు 5వ స్థానం లభించాయి. బెల్లంపల్లి వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య, ధర్మారం ఎస్ఐ లక్ష్మణ్‌లు ఠాణాలకు వచ్చే బాధితులతో మర్యదగా ప్రవర్తించి వారి సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించడం, వారికి పోలీసులపై నమ్మకం కలిగించారని సీపీ శ్రీనివాస్ తెలిపారు. ప్రజలు ఆన్‌లైన్ ఫీడ్ బ్యాక్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు సత్వర సేవలందిస్తున్న విభాగాల్లో పది ఠాణాలను ఎంపిక చేయగా బెల్లంపల్లి ధర్మారం, ఠాణాలకు స్థానం దక్కింది.

అడవి పందుల దాడిలో వరి పంట ధ్వంసం



ధర్మారంలో అడవి పందుల దాడిలో ధ్వంసమైన వరి పంటను చూపిస్తున్న రైతు

కోనరావుపేట, సెప్టెంబరు 24: కోనరావుపేట మండలం ధర్మారం గ్రామశివారులో అడవి పందుల దాడిలో వరి పంట మంగళవారం ధ్వంసం అయింది. గ్రామానికి చెందిన బొడ్డు శంకర్, బొడ్డు ప్రవీణ్, మల్లవేని తిరుపతి అనే రైతులకు చెందిన వరి పొలంను అడవి పందులు ధ్వంసం చేశాయి. కోతకు వచ్చే సమయంలో వరి పంటను ధ్వంసం చేశాయని బాధిత రైతులు తెలిపారు. అటవీశాఖ అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

రుణమాఫీ చేయాలంటూ రైతువేదికకు తాళం

ఇబ్రహీంపట్నంలో నిరసన తెలిపిన రైతులు



రైతువేదికకు తాళం వేసి నిరసన తెలుపుతున్న రైతులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 24 : రెండు లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇబ్రహీంపట్నం రైతులు ఇబ్రహీంపట్నం రైతువేదిక కార్యాలయానికి తాళంవేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రుణమాఫీ, రైతుబంధు నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15 రోజున 2లక్షల రుణమాఫీ చేస్తా అని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు చేయలేదన్నారు. వానాదకాలం సీజన్ ముగిసిన ఇప్పటి వరకు రైతుబంధు రాలేదని ఇప్పటికైన ప్రభు త్వం కళ్లు తెరిచి రుణమాఫీ, రైతు బంధు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు ఏలేటి చిన్నారెడ్డి, నాంపల్లి రమేష్, కల్లెం చిన్న సాయన్న, బాన జలంధర్, తీగల రవీంధర్‌రెడ్డి, బద్దం సత్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

కలెక్టర్ బి.సత్యప్రసాద్



అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థుల ఎత్తు పరిశీలిస్తున్న కలెక్టర్

గొల్లపల్లి, సెప్టెంబరు 24: వచ్చే పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. గొల్లపల్లి మండలంలోని కేజీబీవీ బాలికల వసతి గృహాన్ని, చిల్వాకోడూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల తరగతులను సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన బోధనను అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థను, పాఠశాల కాంపౌండ్ వాల్‌ను పరిశీలించారు. అనంతరం మండలంలోని చిల్వాకోడూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు సంబంధించిన రిజిష్టర్ నమోదు చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సాయిబాబా, తహసీల్దార్ మహ్మద్ జమీర్, ఎంపీడీవో రాంరెడ్డి, ఎంఈవో జమునా దేవి, కేజీబీవీ ప్రత్యేకాధికారి పద్మ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

జగిత్యాల అర్బన్: జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కలెక్టర్ సత్యప్రసాద్ సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. రూ.32.36 కోట్ల వ్యయంతో నూకపెల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్లలో జరుగుతున్న మురికి కాలువ నిర్మాణం, నీటి వసతి, విద్యుత్ సౌకర్యం, పైపులైన్‌ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట పంచాయతీరాజ్ ఈఈ రెహమాన్, శేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ రాజేశ్వర్, జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, తహసీల్దార్ ఉన్నారు.

కలెక్టర్‌కు ఆర్యవైశ్యుల వినతి

జగిత్యాల: తెలుగు విశ్వవిద్యాలయానికి ప్రస్తుతమున్న పొట్టి శ్రీరాములు పేరును మార్చాలని చేస్తున్న ప్రయత్నాలు విరమించుకోవాలని ఆర్యవైశ్య మహా సభ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. మంగళవారం జిల్లా ఆర్యవైశ్య మహా సభ అధ్యక్షుడు మైలారపు లింబాద్రి నేతృత్వంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆర్య వైశ్య సభ్యులు కలెక్టర్ సత్య ప్రసాద్, ఏవో హన్మంత్ రావులకు వినతి పత్రం అందించారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మైలారపు లింబాద్రి, జగిత్యాల, మెట్‌పల్లి ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు వూటూరి నవీన్, రాంబాబు, జిల్లా రా రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు నూనె శ్రీనివాస్ పాల్గొన్నారు.



డబుల్ బెడ్ రూం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

●ఓటరు నమోదు కార్యక్రమం కట్టుదిట్టంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి నాగిరెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించారు. మంగళవారం హైద్రాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ సత్య ప్రసాద్‌తో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి నాగిరెడ్డి దిశా నిర్దేశం చేశారు. సెప్టెంబర్ 28వ తేదీ నాటికి ఇంటింటి సర్వే వంద శాతం పూర్తి చేయాలని సూచించారు.

అంగన్ వాడీ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలి

అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ అధికారులు, సూపర్‌వైజర్లు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి బోనగిరి నరేశ్, ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, సఖీ, మహిళా శక్తి సిబ్బంది పాల్గొన్నారు.

మండల స్థాయి కళోత్సవ పోటీలు

రాయికల్, సెప్టెంబరు 24: రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి 2024-25 కళోత్సవ పోటీలను నిర్వహించారు. నృత్యం, చిత్రలేఖనం, కాగితాలతో బొమ్మలను తయారీ తదితర పోటీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు నృత్య పోటీల్లో గుమ్మడి అక్షర, గ్రూప్ డ్యాన్స్‌లో రసజ్ఞ గ్రూప్, మూకాభినయంలో కస్తూర్బా విద్యాలయానికి చెందిన హరిత గ్రూప్, బొమ్మల తయారీలో రిషిత, చిత్రలేఖనం పోటీల్లో శ్రావణి ప్రతిభ కనబరిచారు. అలాగే బాలుర పాఠశాలకు చెందిన ఈగల కౌసల్య, బాలికల పాఠశాలకు చెందిన రాకేష్, ఎం.హంపీ ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 26న జగిత్యాలలోని టీచర్స్ భవన్‌లో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో మండలస్థాయి కళోత్సవాల ఇన్‌చార్జి అక్కెనపెల్లి సతీష్, నోడల్ అధికారి శ్రీపతి రాఘవులు, ఉపాధ్యాయులు పొన్నం రమేష్, చెరుకు మహేశ్వరశర్మ, మల్లారెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

పేదలకు ఆపన్నహస్తం సీఎంఆర్‌ఎఫ్

ఎమ్మెల్యే డాక్టరు సంజయ్ కుమార్

సారంగాపూర్, సెప్టెంబరు, 24: సీఎం సహాయనిధి నిరుపేదలకు ఆపన్నహస్తం అందిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల రైతు వేదికలో 60 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్, తొమ్మిది మంది ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమం ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజాపాలన అందిస్తున్నామన్నారు. త్వరలో అర్హులైన వారందరికి రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాజేందర్‌రెడ్డి, సురేందర్, కోల శ్రీనివాస్, డిల్లీ రామరావు, శేఖర్‌గౌడ్, అర్రె ప్రేమనందం పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెట్టారని ఇప్పపల్లి వాసుల నిరసన

కథలాపూర్, సెప్టెంబరు 24 : తాము అడవిని నరికివేశామని అక్రమ కేసులు పెట్టడంపై మంగళవారం ఇప్పపల్లి వాసులు నిరసన తెలిపారు. అడవిని ధ్వంసం చేశారని ఫారెస్ట్ అధికారులు సుమారు 10 మందిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసులు నమోదు చేసిన ఘటనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, కోరుట్ల, మేడిపల్లి ఎస్సైలు శ్రీకాంత్, శ్యాంరాజ్‌లు ఇప్పపల్లికి వెళ్లడంతో తమ గోడు వినిపించారు. అడవులను కొందరు పోతారం వాసులు సుమారు 300 ఎకరాల్లో నరికివేసి ధ్వంసం చేసినా పట్టించుకోవడం లేదని డీఎస్పీతో వాదించారు. బుధవారం ఫారెస్ట్ అధికారులు, రెవెన్యూ అధికారులను కథలాపూర్ పిలిపించి విచారణ చేస్తామని గ్రామం నుంచి కేవలం 10 మంది మాత్రమే హాజరు కావాలని డీఎస్పీ సూచించారు.

పెండింగ్ డీఏలు, పీఆర్సీ కోసం కృషి

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

ధర్మపురి, సెప్టెంబరు 24: కొంత కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్‌సీ విడుదల కోసం కృషి చేస్తామని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బోయిన్‌పెల్లి ఆనందరావు, ప్రధాన కార్యదర్శి యాల్ల అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. జిల్లా కార్యవర్గం ఏర్పాటు జరిగిన తరువాత లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం పక్షాన వారందరిని వేదపండితులు ఆశీర్వదించి, స్వామి శేష వస్త్ర, ప్రసాదాలు అందించారు. అనంతరం వారు విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీ ఎస్‌ను అమలు చేయాలని వారు కోరారు. ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను అమలు చేసి మండల విద్యాధికారుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మండల బాధ్యులు దహెగాం గణేష్, రాజేందర్‌రెడ్డి, వేణుగోపాల్, కిరణ్, వంశీ, బోగ శివప్రసాద్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌కుమార్

కొడిమ్యాల, సెప్టెంబరు 24 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌కుమార్ అన్నారు. స్వ చ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన శ్రమదానం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ కొడిమ్యాల శాఖ మేనేజర్ సంజీవ్‌కుమార్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లావణ్య, బ్యాంక్ అధికారి సాగర్, గోల్డ్ అప్రైజర్ ముమ్మాడి స్వామి పాల్గొన్నారు.

ధర్మపురి పట్టణ హోటల్ కార్యవర్గం

ధర్మపురి, సెప్టెంబరు 24: ధర్మపురి పట్టణంలోని ఎస్ఆర్ఆర్ గార్డెన్స్‌లో హోటల్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హోటల్ యజమానుల అందరు సమావేశం నిర్వహించిన తరువాత కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ధర్మపురి పట్టణ హోటల్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా స్తంభంకాడి మహేష్, ఉపాధ్యక్షులుగా మైదం తిరుపతి, ఆసం మణికంఠ, ప్రధాన కార్యదర్శిగా మామిడిపెల్లి సత్యనారాయణను ఎన్నుకున్నారు. కోశాధికారిగా అప్పం మల్లేష్, సంయుక్త కార్యదర్శులుగా కుమార్, కైలాస్, కార్యవర్గ సభ్యులుగా సాయికృష్ణ, అన్నందాసు నరేష్, వినయ్, రాజు, శ్రీనివాస్, ముఖ్య సలహాదారులుగా రాజేష్, గణేష్‌లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

'స్వచ్ఛతా హీ సేవ' లో భాగస్వామ్యం కావాలి

మున్సిపల్ కమిషనర్ తిరుపతి

కోరుట్ల, సెప్టెంబరు 24 : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో యువత భాగస్వామ్యం కావాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతి అన్నారు. మంగళవారం పట్టణంలోని అయిలాపూర్ రోడ్డులో యువకులతో కలిసి మున్సిపల్ అధికారులు శ్రమదానం నిర్వహించారు. తడి పోడి చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పించిన మున్సిపల్ అధికారులు సంబదింత కరపత్రం ఆవిష్కరించారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ గొనెల మహేష్, అయిలాపూర్ రోడ్డులోని యువత పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సేవా దినోత్సవం

కోరుట్ల, సెప్టెంబరు 24 : జాతీయ సేవ దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలో పశువైద్య కళాశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. మోడికోల్, ప్రోఫెసర్లు స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో శ్రమదానం నిర్వహించారు. కళాశాల అవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. కళశాల అసోసియేట్ డీన్ దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు. పట్టణంలోని డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జు ప్రిన్సిపల్ సందీప్ ఆధ్వర్యంలో జాతీయ సేవా దినోత్సవంను నిర్వహించారు.

ఎన్‌ఎస్‌ఎస్‌తో సమగ్ర వ్యక్తిత్వ వికాసం

ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ మనోహరాచారి

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 24: ఎన్‌ఎస్‌ఎస్‌తోనే సమగ్ర వ్యక్తిత్వ వికాసం సిద్దిస్తుందని ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ అవార్డు గ్రహీత, రిటైర్డ్ ఉపన్యాసకులు డా.మనోహరాచారి అన్నారు. పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మనోహరాచారి మాట్లాడుతూ 1969లో 40 వేల మంది వలంటీర్లతో మొదలైన ఎన్‌ఎస్‌ఎస్ ప్రస్తుతం 38లక్షల వలంటీర్ల ను కలిగి ఉందన్నారు. దీనిద్వారా విద్యార్థులకు క్రమశిక్షణ, నాయకత్వల క్షణాలు, సేవా ధృక్పతం అలవడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు చేసిన నృత్యప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీలత, సుజాత, వైస్ ప్రిన్సిపాల్ చంద్రయ్య, వాసవి, ప్రమోదకుమార్, రాంచందర్, నీరజ, జము న, సునీత, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

●సమాజ సేవలో వాలంటీర్లు ముందుండాలని ఎన్‌ఎస్‌ఎస్ నోడల్ అధికారి ఆడెపు శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ అలియా మక్సూద్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి తిరుపతి రెడ్డి, అధ్యాపకులు రిజ్వానా, శిల్ప, సునీత, సుమేరా, రాజయ్య, మాధవి, శ్రీలత, స్వరూప తదితరులున్నారు.



ఉపన్యాసకులను సన్మానిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల

వరిలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

మల్యాల, సెప్టెంబరు 24: ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉన్నందున రైతులు తగు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.చంద్రదీపక్ సూచించారు. మండలంలోని మల్యాలలో వ్యవసాయ అధికారులు మంగళవారం వరిక్షేత్రాలను సందర్శించారు. పలు సూచనలు చేశారు. ఏఈవోలు మంజుల, శ్రీనివాస్, కారుణ్యకు మార్, శ్రీనివాస్ రైతులు పాల్గొన్నారు.

పెగడపల్లి : వరి పంటలో బాక్టీరియా చేరి ఎండు తెగులు సోకుతుందని దాని నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలోని పలు వ్యవసాయ క్షేత్రాలను మంగళవారం వ్యవసాయ విస్తీర్ణాధికారులు పరిశీలించారు.

317 జీవో బాధితులకు న్యాయం చేయాలి

కథలాపూర్, సెప్టెంబరు 24 : నిర్బంధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులను 317 జీవోతో ఇతర ప్రాంతాలకు బదిలీ కాబడి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బాధితులకు న్యాయం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి దేవయ్య, బోయినపల్లి ప్రసాదరావు కోరారు. మంగళవారం మండలంలోని పలు పాఠశాలల్లో కార్యక్రమం ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. మండల విద్యాధికారులకు జూనియర్ డిప్యూటీ డీఈఓ, డైట్ లెక్చరర్లుగా ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు రవికుమార్, జిల్లా బాధ్యులు చంద్రశేఖర్, అందె శివప్రసాద్, మండల అధ్యక్షుడు న్యాలం వెంకటేశ్, కిష్టయ్య ఉన్నారు.

నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలి

కోరుట్ల, సెప్టెంబరు 24 : నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పద్మశాలి సంఘ నూతన కార్యవర్గంను సన్మానించి అభినందించారు. కోటి నవదుర్గ దేవాలయం నిర్వహించు దసర నవరాత్రి ఉత్సవాల కరపత్రం ఆవిష్కరించారు. పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాతంలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి మంజూరైన నిదుల ప్రొసిడింగ్ పత్రాలను నిర్వాహకులు అందించారు. దేవాలయాల నిర్వాహకులు, పద్మ శాలి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చుతుంది

నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 24 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవెర్చుతుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సంగరావు అన్నారు. మంగళవారం యూసుప నగర్ గ్రామంలో మహాలక్ష్మి పథకం ద్వార రూ. 500 సిలెండర్‌కు ఎంపికైన లబ్ధిదారులకు ప్రొసిడింగ్ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నర్సింగరావు మాట్లాడారు. రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజల అవసరాలను తెలుసుకోని పలు పథకాలను రూ పొందించి అందిస్తున్నాడని అన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ ప్రకటించి అమలులోకి తీసుకవచ్చిందని అన్నారు. నర్సింగరావును లబ్ధిదారుల సన్మానించి అభినం దించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మ న్ పన్నాల అంజిరెడ్డి, వైస్ చైర్మన్ వెంకటేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు ప్రియాంక -సురేష్, నాయకులు పెరమాండ్ల సత్యనారాయణ గౌడ్, పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందిస్తున్న నర్సింగరావు

కలుషితమైన నీరు ప్రాణాంతకం

మంచినీటి పారుదల డీఈఈ ఆనంద్

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 24 : కలుషితమైన నీరు తాగటం వలన వ్యాధుల బారిన ప్రమాదం ఉంటుందని మంచినీటి పారుదల, మిషన్ భగీరథ డీఈఈ ఆనంద్ అన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలోని బోర్‌ను రిపేరు చేయడంపై సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం సమావేశం మందిరంలోని సదస్సులో మాట్లాడుతూ మంచి నీటిని సరఫరా చేసే సమయంలో లీకేజులు ఏర్పాడినప్పుడు కలుషతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంచి నీటి నాణ్యతను ఎప్పటిక ప్పుడు పరిశీలించారు. మంచినీటి జీవకోటికి ప్రాణవాయు, కాబట్టి నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు కూడా ఉంటాయన్నారు.

నీరు కలుషతమైనప్పుడు ప్రాణాపాయం అయ్యే ప్రమాదం కూడ ఉందొచ్చాన్నారు. నీటి సరఫరా చేసే సమయంలో ప్రతి పరి శీలించాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మంచినీటి సహాయకలు, సిబ్బంది, తది తరులు పాల్గొన్నారు.

'ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించాలి'

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 24 :గ్రామాల్లో ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించాలని జిల్లా స్థానికసంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు రోజుల పాటు మంచినీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలుతున్న దృష్ట్యా ప్రజలకు నాణ్యమైన మంచినీటిని అందించాలని సూచించారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సెక్షన్‌ను తనిఖీ చేశారు.

ప్రజలకు అందిస్తున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్ర మంలో ఎంపీడీవో రమాదేవి, ఎంపీవోలు సలీం, రవిబాబు, ఏపీవోలు దయాకర్, గంగాలక్ష్మణ్, ఆయాగ్రామాల పంప్ ఆపరేటర్స్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా మరింత రాణించాలి

జిల్లా గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు సంచాలకులు రఘువరన్

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 24: మహిళలు మరింత రాణించి ఆర్థికంగా ఎదగాలని జిల్లా గామీణాభివృద్ధి ప్రాజెక్టు సంచాలకులు రఘువరన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమీపంలో ఇందిరా మహిళశక్తి కార్యక్రమంలో భాగంగా ఉజ్వల మండల సమఖ్య కోరుట్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళ క్యాంటిన్‌ను అదనపు సంచాలకులు చరణ్ దాసుతో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలతో రాణించి ఆర్థికంగా మహిళ సంఘాలు సమాజంలో నిలదొక్కుకోవాలన్నారు. మహిళలు స్వయం ఉపాధితో రాణించి మంచి పేరు సాధించాలన్నారు. మహిళల నుంచి తయారు చేసే జ్యూట్ బ్యాగులు, వివిధ రకాల ఉత్పత్తులైన గానుగ నూనె, పల్లీ, నువ్వుల నూనె తయారు చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలను మహిళా సంఘ సభ్యులు ప్రదర్శించగా పలువురు అధికారులు కొనుగోలు చేసారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట కిషన్, ఎంపీడీవో రామకృష్ణ, డీపీఎం, ఏపీఎం శంకర్, సీసీలు వివోఏలు, మహిళ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

శిఖరాలు అధిరోహించాలి

కోరుట్ల రూరల్: విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అదిరోహించాలని జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్ అన్నారు. మంగళవారం మండలంలోని అయిలాపూర్‌ని జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు పంచాయితీ రికార్డులను తనీఖీ చేసిన ఉపాధ్యాయులకు విద్య బోధనపై పలు విషయాలను వివరించారు. అదే విధంగా పంచాయతీ ఎన్నికల నిర్వహన కోసం పాఠశాలలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. పాఠశాలలోని పలు తరగతి గదులను పరిశీలించిన అధికారి విద్యార్థులతో పలు ప్రశ్నలను అడిగి సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయులు మెరుగైన విద్యను అందించాలన్నారు. అదే విధంగా ఎన్నికల నిర్వహన కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లలో మౌలిక వసతులు ఏర్పాటు చేసి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పారిశుద్య పనులను పరిశీలించి అంటు వ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వోదెల రామకృష్ణ, ఎంపీవో కృపాకర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.



మహిళా సంఘ సభ్యులతో రఘువరన్

సంక్షిప్తం సమాచారం

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ శివారులోని సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ గురుకుల అగ్రికల్చర్ కాలేజీ, కోరుట్ల కళాశాలలో మహిళా అధ్యాపకుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ గునుక శ్రీలత తెలిపారు. వివరాలకు 8374000563, 8639365500 నంబర్లలో సంప్రదించాలన్నారు.

గొల్లపల్లి: ఇటీవల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన భీమ సంతోష్‌ను మల్లన్నపేట నాయిబ్రాహ్మణ సంఘం సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. నాయిబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు ముత్యాల గంగారాం, ఉపాధ్యక్షుడు కందుల నారాయణ, పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండలంలోని శ్రీరాములపల్లెలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. గొల్లపల్లి మండల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పుర పాటి రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ లంబ లక్ష్మణ్, నాయకులు నేరెళ్ల రాజిరెడ్డి, కిష్టంపేట రమేష్‌రెడ్డి, తిరుపతి, బాలె తిరుపతి ఉన్నారు.

కొడిమ్యాల: విద్యార్థులు చిన్న నాటి నుంచే చదువుతో పాటుగా సేవాభావం పెంపొందించుకోవాలని కొడిమ్యాల ఎస్సై సందీప్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో 55వ జాతీయ సేవా పథకం దినోత్సవం నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్. వేణు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ తిరుపతి, పాల్గొన్నారు.

●మండలంలోని తిర్మాలాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం నుంచి నిర్వహించు జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు జ్యోత్స్నదేవి మంగళవారం తెలిపారు. ఉన్నత పాఠశాలకు చెందిన బాలురు అభినయ్, అఖిలేష్, శివమణి, కౌశిక్, బాలకలు అపూర్వ, రమ్య, మనస్విని, మనస్విలను మెడల్ అందించి అభినందించారు.

●మండలంలోని దమ్మ య్యపేట, కోనాపూర్, తిర్మాలాపూర్ గ్రామాల్లో మంగళవారం బీజేపీ సభ్యత్వ మండల కన్వీనర్ చల్ల శ్రీనివాస్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి బీజేపీ సభ్యత్వ నమోదును చేయించారు. బీజేపీ నాయకులు సురేష్, సాయిబాబా, అరుణ్, శంకర్, మహేష్ ఉన్నారు.

●తిరుమల లడ్డు ప్రసాదంలో జంతువుల కొవ్వుతో చేసిన నెయ్యి వాడడంతో కల్తీ చేసిన వారిని శిక్షించా లని కోరుతూ మండల కేంద్రంలోని అంగడి బజారులో హిందు సంఘ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు..

జగిత్యాల అర్బన్: ఈ నెల 29వ తేదీన జరుగనున్న ఆర్యవైశ్య మహాసభ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరు కావాల్సిందిగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ఆర్యవైశ్య మహా సభ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మైలారపు లింబాద్రి ఆహ్వానించారు.

మల్యాల: మల్యాల క్రాస్ రోడ్డు వద్ద గల కొత్త సురేష్ పెట్రోల్ పంప్, వద్ద మంగళవారం పంప్ నిర్వహకులు, కోరుట్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి వైద్య బృందం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 260 మందికి వైద్య పరీక్షలు చేయగా 75 మందిని ఉచిత శస్త్రచికిత్స కోసం రేకుర్తికి తరలించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, హెచ్‌పీసీఎల్ అధికారి రాజేశ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మహేందర్, నరేంద్ర, జగపతిరెడ్డి పాల్గొన్నారు

కథలాపూర్: మండలంలోని తక్కళ్ళపల్లిలో పురాతన ఆలయం భోగేశ్వరస్వామికి చెందిన భూములను తోట రాజయ్య అనే వ్యక్తి అక్రమించి అమ్ముకున్నాడని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌కు మంగళవారం ఆ గ్రామ వీడీసీ సభ్యులు ఫిర్యాదు చేశారు. అంజయ్య, గంగారాం, ప్రధాన కార్యదర్శి రమేశ్ ఉన్నారు.

మెట్‌పల్లి రూరల్ : గ్రామాల్లోని రైతుల నుంచి ఉత్పత్తులను కొనుగోలు చేపట్టాలని ఏపీడీ చరణ్‌దాస్ సూచించారు. మంగళవారం మెట్‌పల్లి మండల సేర్ప్ కార్యాలయంలో మహిళ ఉత్పత్తి దారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీపీఎం వెంకటేష్, ఏపీఎం శంకర్, ఉస్సేన్, సీసీలు తిరికోవెల వెంకటరమణ, సూరయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కథలాపూర్: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ఊరూరా ప్రచారం చేయాలని నియోజకవర్గ బీజేపీ నేత చెన్నమనేని వికాస్‌రావు కోరారు. మంగళవారం మండలంలోని గంభీర్‌పూర్, తాండ్ర్యాల, పోతారం గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రాయికల్ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 50 నుంచి 61 ఏళ్ల మధ్య గల వీఆర్‌ఏలు రాయికల్ తహసీల్దార్ ఖయ్యాంకు వినతి పత్రం సమర్పించారు. గత ప్రభుత్వం వీఆర్‌ఏల సర్దుబాటు కోసం ఇచ్చిన జీవో 81, 85, 98 వలన ప్రమోషన్ పొంది 55 నుంచి 61 సంవత్సరాల మధ్య గల వృద్ధ వీఆర్‌ఏ కుటుంబాలు రాష్ట్రంలో దాదాపు 2500 దళిత కుటుం బాలు రోడ్డున పడ్డాయన్నారు. మరిన్ని సమస్యలను ప్రస్తావిస్తూ తహసీల్దార్‌కు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. బెక్కం లక్ష్మణ్, భీమయ్య పాల్గొన్నారు.

పెగడపల్లి: సామాజిక అంశాలపై జిల్లా పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ మోడల్ స్కూల్‌లో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు పోలీస్ కళా బృందం వారు మానవ అక్రమ రవాణా, షీ టీమ్, ఆత్మహత్యల నివారణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి, పి.సి సంపత్, కళా బృందం సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగిత్యాల(ఆంధ్రజ్యోతి): అర్హతకు మించి వైద్యం చేసి అనారోగ్యానికి గురిచేసిన పీఎంపీ వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమీయోద్దిన్‌కు జిల్లాలోని మల్లాపూర్ మండలం సిర్‌పూర్ గ్రామానికి చెందిన బాధితుడు తునికి నిఖిల్ ఫిర్యాదు అందించాడు.

మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం): గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కారించాలని కోరుతూ మంగళవారం టిఎస్‌యూటిఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కు వినతి పత్రం అందజేశారు.

మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం): ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ టి. మోహన్ అన్నారు. స్వచ్ఛత హీ సేవ 2024-25 కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య సిబ్బందితో స్వచ్ఛతపై అవగహన కల్పించారు.

●ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అధాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వెల్ముల రాంబాబు కోరారు. మంగళవారం మెట్‌పల్లి కోర్టులో జూనియర్ సివిల్ జడ్జీ అరుణ్ కుమార్ కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

మెట్‌పల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య మోకులు తాళ్లు ఎక్కే గీత కార్మికుల రక్షణగా నిలుస్తాయని మెట్‌పల్లి ఎక్సైజ్ సీఐ వినోద్ రాథోడ్ పేర్కొన్నారు. పెద్దాపూర్ గ్రామంలోని గీత కార్మికులకు కాటమయ్య సేఫ్టీ మోకులపై అవగాహన సదస్సు కల్పించారు.

బీర్‌పూర్: తెగుళ్ల కారణంగా పంటలలో వస్తున్న మార్పులను గమణించి రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వాణి అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాలలో పర్యటించి వరి, పత్తి, కంది పంటలను పరిశీలించారు.